# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

“ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం” అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్ాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 100 | పేజీలు : 08 | శుక్రవారం | 17-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## “నజీరాగా పేరు మార్చి కల్మా చదివించారు, బీఫ్ తినిపించారు”.. లవ్ జిహాద్ బాధితురాలి ఆవేదన..

**నగరంలోని కూకట్‌పల్లిలో సంచలనం రేపుతున్న ‘లవ్ జిహాద్’ ఘటన**

**సంచలన విషయాలు వెలుగులోకి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, సెంట్రల్ బ్యూరో:** నగరంలోని కూకట్‌పల్లిలో సంచలనం రేపుతున్న ‘లవ్ జిహాద్’ ఘటనలో తీవ్రమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని ట్రాప్ చేసిన యువకుడు.. ఆమె మతం మార్చడంతో పాటు, తన సోదరులతో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు ఆరోపించింది. తనపై జరిగిన అకృత్యాలను వివరిస్తూ ఆమె తాజాగా సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ముందుకు వచ్చి కన్నీరుమున్నీరుగా తన ఆవేదనను పంచుకుంది. నెల్లూరుకు చెందిన నవాజ్ అనే వ్యక్తి.. 2025 మే నెలలో కూకట్‌పల్లిలో ట్రేడింగ్, ఫుడ్ బిజినెస్ పేరుతో బాధితురాలి కుటుంబానికి పరిచయమైనట్లు తెలిపింది. తాను హిందువుగా మారిపోయానని, తన పేరు ‘నవదుర్గ’ అని నమ్మించేందుకు ఏకంగా ఓ సర్టిఫికెట్ కూడా చూపించాడని వెల్లడించింది. నవాజ్ సోదరులు కూడా ఇదే మాట చెప్పి ఆమెను నమ్మించారని, భవిష్యత్తులో దుబాయ్ వెళ్లిపోదామని మాయమాటలు చెప్పి, గత ఏడాది జూలైలో పెళ్లి చేసుకున్నట్లు తెలిపింది. పెళ్లి సమయంలో ఆమె పేరును ‘నజీరా’గా మార్చాడని ఆరోపించారు.

**మతం మార్చి, చిత్రహింసలు:**

అక్టోబర్ నెలలో నవాజ్‌కు అప్పటికే రెండు పెళ్లిళ్లు అయినట్లు బాధితురాలికి తెలిసింది. దీంతో నవాజ్ ఆమెను బెదిరించడం మొదలుపెట్టాడని, గుల్బర్గాలోని ఖాజా నవాజ్ దర్గా వద్దకు తీసుకెళ్లి బలవంతంగా మతం మార్పించి, కల్మా చదివించాడని తెలిపింది. చెప్పిన మాట వినకపోతే తీవ్రంగా కొట్టేవాడని, బలవంతంగా బీఫ్ (గోమాంసం) తినిపించేవాడని ఆమె ఆరోపించింది. బేగంపేట్‌లో తనకు మత్తు మందు ఇచ్చి అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా.. నవాజ్ తమ్ముళ్లు మునవార్, షారుక్, ఇస్మాయిల్‌లు తనపై సామూహిక అత్యాచారానికి (గ్యాంగ్ రేప్) పాల్పడ్డారని బాధితురాలు సంచలన ఆరోపణలు చేసింది.

**బ్లాక్ మెయిల్.. ఆర్థిక దోపిడీ**

## రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం

రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

తనపై నమ్మకంతో కాంగ్రెస్ అవకాశం ఇచ్చిందన్న నరేందర్ రెడ్డి

తెలంగాణ హక్కులపై సభలో పోరాటం చేస్తానని వెల్లడి

ప్రమాణ స్వీకారం చేసిన కొత్తగా ఎన్నికైన సభ్యులు




## క్షమాపణలు చెప్పాలి

తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్

తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడం పై ఆగ్రహం

తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండటమేమిటని ప్రశ్న

ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని మండిపాటు

తెలంగాణ వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉందన్న కేటీఆర్

తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీజేపీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్




## వాదన విని నవ్వుతున్నారు

**రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు:లోక్ సభలో తేజస్వీ సూర్య**

**డీలిమిటేషన్‌కు జీఎస్‌డీపీని ముడిపెట్టడం మూర్ఖత్వమన్న తేజస్వీ సూర్య**

**నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని హామీ**

**ఏపీ, తెలంగాణలను కాంగ్రెస్ విభజించిన తీరు బ్రిటిష్ కంటే దారుణంగా ఉందని వ్యాఖ్య**

**కాంగ్రెస్ చేసిన విభజన కారణంగా ఏపీ, తెలంగాణ మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం ఉందన్న ఎంపీ**




హైదరాబాద్ పల్స్,డెస్క్

డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు.

## ఏపీకి 38, తెలంగాణకు 26 సీట్లు..

### డీలిమిటేషన్‌పై అమిత్ షా కీలక ప్రకటన


**లోక్‌సభ స్థానాల పునర్విభజనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ**

**డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని స్పష్టత**

**ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి సీట్లు పెరుగుతాయని వెల్లడి**

**ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అమిత్ షా విమర్శ**

**జనాభా ప్రాతిపదికన విభజనను వ్యతిరేకిస్తున్న దక్షిణాది నేతలు**




హైదరాబాద్ పల్స్,డెస్క్

లోక్‌సభ స్థానాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. డీలిమిటేషన్ తర్వాత దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు తగ్గవని, పైగా సంఖ్యాపరంగా, నిష్పత్తి పరంగా కూడా పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి పెరుగుతాయని నిర్దిష్ట లెక్కలతో సహా వివరించారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. లోక్‌సభ మొత్తం సీట్ల సంఖ్యను పెంచిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల సీట్లు కూడా

## తేజస్వి సూర్యపై కవిత నిప్పులు..

**రాజీనామా చేయాలని డిమాండ్**




తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడారంటూ తేజస్విపై కవిత ఫైర్

పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరిక

కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

## స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి




కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి: రాంచందర్ రావు

కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే తెలంగాణలో 17 ఉన్నాయన్న రాంచందర్ రావు

ముందు కేరళలో సీట్లు తగ్గించాలని అడగాలని సవాల్

కాంగ్రెస్ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చిందని ఆరోపణ

## తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి: పొన్నం ప్రభాకర్

తెలంగాణ ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య

తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం డిమాండ్

బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న




## బీసీలు చట్టసభల్లో ఉన్నపుడే వారికి న్యాయం జరుగుతుంది: శ్రీనివాస్ గౌడ్

2

## తేజస్వి సూర్య సంగతి తేల్చేవాళ్లు




బీఆర్ఎస్ ఎంపీలే సభలో ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చేవాళ్లు: హరీశ్ రావు

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తేజస్వి సూర్య కించపరిచారన్న హరీశ్

తెలంగాణ త్యాగాల పునాదులపై ఏర్పడిందని వ్యాఖ్య

రక్తపాతంతో కూడిన విభజనతో తెలంగాణను పోలుస్తారా అని మండిపాటు

మోదీ బాటలో నడుస్తూ తేజస్వి విషం చిమ్ముతున్నారని ఆగ్రహం

# వాదన విని నవ్వుతున్నారు

మొదటి పేజీ రువాయి

సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని చురక అంటించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు. కాంగ్రెస్ నాడు అత్యంత దారుణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను విభజించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటిష్ వారి కంటే దారుణంగా ఉందని అన్నారు. ఏపీ, తెలంగాణ విభజనను కాంగ్రెస్ పాకిస్థాన్, భారత్ విభజనతో పోల్చారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని అన్నారు.

# రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం

మొదటి పేజీ రువాయి

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేం నరేందర్ రెడ్డి ఈరోజు రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల పలువురు నేతలు రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం, వేం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తన మీద నమ్మకంతో రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలు, సమస్యలు, రాష్ట్ర హక్కులు, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి పార్లమెంటులో పోరాటం చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల వికాసం, అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, తెలంగాణ నుంచి ఎన్నికైన మరో కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ తదితరులు కూడా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

## తేజస్వి సూర్య
# సంగతి తేల్చేవాళ్లు

మొదటి పేజీ రువాయి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చేవారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు... ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్-పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదే బాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

# “నజీరాగా పేరు మార్చి కల్మా చదివించారు, బీఫ్ తినిపించారు”.. లవ్ జిహాద్ బాధితురాలి ఆవేదన..

మొదటి పేజీ రువాయి

తన ఫొటోలు, వీడియోలు అడ్డం పెట్టుకుని నవాజ్ తనను బ్లాక్ మెయిల్ చేశాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే తన తల్లిని, చెల్లిని చంపేస్తానని బెదిరించాడని యువతి వాపోయింది. తన పేరు మీద లోన్లు తీసుకోవడంతో పాటు, తన బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదవపెట్టి డబ్బులు కాజేశాడని, శంషాబాద్‌లోని ఓ ఫ్లాట్‌ను సైతం అమ్మేశాడని తెలిపింది. ఈ దారుణాలపై బాధితురాలు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. నిందితుడు నవాజ్ హైదరాబాద్ నుంచి నెల్లూరుకు పారిపోయాడు. పైగా తాను ఏ తప్పు చేయలేదని, ఆ అమ్మాయే తనను ట్రాప్ చేసిందంటూ కేసును తప్పుదోవ పట్టించేలా ఓ వీడియోను విడుదల చేశాడు. ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకే తాను మీడియా ముందుకు వచ్చానని బాధితురాలు స్పష్టం చేసింది.

**లవ్ జిహాద్ నిజమే..**

‘లవ్ జిహాద్ నిజమే. హిందూ అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారు. నేను దానికి బాధితురాలిని. నా ఫొటోలు, వీడియోల కోసమే ఇన్నాళ్లు వాళ్ళ బెదిరింపులకు భయపడ్డాను. కానీ నాకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదనే ఉద్దేశంతోనే ధైర్యంగా బయటకు వచ్చి ఈ విషయాలు చెబుతున్నాను.’ అని బాధితురాలు సంచలన ఆరోపణలు చేసింది.

# తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

మొదటి పేజీ రువాయి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్ని అవమానించినందుకు ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ డీఎన్ఏ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని ఆయన నిలదీశారు. తెలంగాణ ఏర్పాటు అనేది దశాబ్దాల పోరాటమని, వేలాది మంది త్యాగాల ఫలితమని, దానిని విద్వేషపూరిత విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. తేజస్వి సూర్యకు తెలంగాణ చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఒక జాతీయ పార్టీకి చెందిన ఎంపీ ఇంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

# స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి

మొదటి పేజీ రువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు. కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే, తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. మొదట కేరళలో లోక్ సభ సీట్లను తగ్గించాలని రేవంత్ రెడ్డి అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని, డీలిమిటేషన్ చేపట్టాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ కొత్త పార్లమెంటు భవనంలోనే కోరారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారే వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ఇప్పుడు కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వింత వాదన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# క్షమాపణలు చెప్పాలి

మొదటి పేజీ రువాయి

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# తేజస్వి సూర్యపై కవిత నిప్పులు..

మొదటి పేజీ రువాయి

పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కార్చిచ్చు రేపాయి. ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా వేదికగా తేజస్వి సూర్యపై విరుచుకుపడ్డారు. నిండు పార్లమెంట్‌లో తెలంగాణ అస్తిత్వాన్ని, అమరవీరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీకు ఎంత ధైర్యం ఉంటే తెలంగాణ ఏర్పాటును ఒక విద్వేషపూరిత విభజనతో పోలుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తేజస్వి సూర్య తన ఎంపీ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అంటే ఒక పోరాటమని, కోట్లాది మంది కలల సాకారమని... అటువంటి పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి బీజేపీ అగ్రనేతలు ఈ వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని కవిత ప్రశ్నించారు. సొంత రాష్ట్రాన్ని అవమానిస్తుంటే అడ్డుకోని వారు పదవుల్లో ఉండటానికి అనర్హులని, తెలంగాణ ప్రజలకు వారు సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు.

# బీసీలు చట్టసభల్లో ఉన్నపుడే వారికి న్యాయం జరుగుతుంది: శ్రీనివాస్ గౌడ్

మొదటి పేజీ రువాయి



ఢిల్లీ, ఏప్రిల్ 16: తెలంగాణలో నిర్వహించిన కుల గణన గణాంకాలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బీసీల అసలు జనాభాను ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపిస్తున్నారని ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 61 శాతం వరకు ఉన్న బీసీ జనాభాను తక్కువగా చూపిస్తూ వాస్తవాలను వక్రీకరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ను ఇప్పటివరకు అమలు చేయలేదని, కులాల వారీగా ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. బీసీలకు తగిన రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా కేవలం పదవులు ఇస్తున్నామంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీ కుటుంబాల వివరాలు సరిగ్గా సేకరించలేదనే కారణంతోనే తెలంగాణలో కుల గణన వివరాలు బయటపెట్టారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ గణాంకాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం జరగాలంటే ముందుగా కామారెడ్డి డిక్లరేషన్‌ను పూర్తిగా అమలు చేయాల్సిందేనని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని, బీసీలు చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందినప్పుడే వారికి న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 56 శాతం పైగా ఉన్న బీసీ జనాభాకు తగిన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు.

# ఏపీకి 38, తెలంగాణకు 26 సీట్లు..

మొదటి పేజీ రువాయి

పెరుగుతాయని తెలిపారు. కర్ణాటకలో 28 నుంచి 42కి, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయన్నారు. ప్రస్తుతం 543 సీట్లున్న లోక్‌సభలో ఐదు దక్షిణాది రాష్ట్రాలకు 129 స్థానాలు (23.76 శాతం) ఉండగా, సభ విస్తరణ తర్వాత 195 స్థానాలకు (సుమారు 23.97 శాతం) పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రజల్లో అనవసర భయాలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను దాదాపు 816 నుంచి 850కి పెంచి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే, జనాభా ప్రాతిపదికన సీట్ల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల పార్లమెంటులో తమ ప్రాతినిధ్యం, ప్రాధాన్యత తగ్గుతుందని వాదిస్తున్నాయి. ఈ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి రావాలని, జనాభాతో పాటు రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) వంటి ఆర్థిక సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మరోవైపు, ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం మాట్లాడుతూ, తొలుత సీట్లు పెరిగినట్లు కనిపించినా, భవిష్యత్తులో జరిగే డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుతానికి ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, అన్ని రాష్ట్రాల సీట్లు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ చర్చల నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, అమిత్ షా పేర్కొన్న నియోజకవర్గాల గణాంకాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# మండల స్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ మండల పరిధిలోని జుక్కల్ శివారులో గల కన్వెన్షన్ హాల్ వేదికగా ఈరోజు "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వివిధ శాఖల పనితీరుపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా ఎమ్మెల్యే రెవెన్యూ, విద్యుత్ (ఎలక్ట్రిసిటీ), ఆర్డబ్ల్యూఎస్ (ఆర్ డబ్ల్యూ యస్ ), విద్యాశాఖ, ఐకేపీ (ఐకేపీ), మరియు హౌసింగ్ శాఖల అధికారులతో గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పనుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, ఇళ్ల నిర్మాణాల విషయంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని, మహిళా సంఘాల బలోపేతానికి ఐకేపీ అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి నారాయణఖేడ్ నియోజకవర్గన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందించి, గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దాహం తీర్చే దాతృత్వం - తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చలివేంద్రం ప్రారంభం

## చిలుకోడు గ్రామ ఉప సర్పంచ్ రామనబోయిన రాజు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** మండుతున్న వేసవి ఎండల్లో ప్రజలకు చల్లని ఉపశమనం కలిగించే సేవా కార్యక్రమం గురువారం గ్రామంలో ఆదర్శంగా నిలిచింది. గ్రామ ఉప సర్పంచ్ రామనబోయిన రాజు తన తల్లిదండ్రులు దివంగత రామనబోయిన వెంకన్న, ప్రమీల జ్ఞాపకార్థంగా చిలుకోడు గ్రామంలో బురుగుపాడు క్రాస్ రోడ్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఖమ్మం – మహబూబాబాద్ ప్రధాన రహదారిపై వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని డోర్నకల్ తహసిల్దార్ రాఘవరెడ్డి ఘనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రాఘవరెడ్డి మాట్లాడుతూ...వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి చలివేంద్రాలు ప్రజలకు ప్రాణాధారంగా మారుతున్నాయని అన్నారు. దాహార్తిని తీర్చడమే కాకుండా, ప్రయాణికులకు తాత్కాలిక విశ్రాంతి కల్పించే ఈ కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 5 ప్రకారం ఎండల తీవ్రత వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గత 5 సంవత్సరాలుగా తన తల్లిదండ్రుల స్మారకార్థం రామనబోయిన రాజు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. చలివేంద్రాలు, అన్నదానాలు వంటి కార్యక్రమాల ద్వారా గ్రామంలో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తున్న ఆయనను గ్రామస్తులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయల వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్ రాయల వెంకట బాబు, వార్డు సభ్యులు సుధాకర్ బడేటి శ్రీను, కాడెం బాబు, దేశని ఉపేందర్, వంగల వెంకయ్య, జర్పుల వెంకన్న, నాగేష్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం ఏఈ కి వినతి

## సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్,ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలోని మోత్కూర్ – భువనగిరి ప్రధాన రహదారి నుంచి హైస్కూల్ వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డుకు ఆనుకుని ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, రోడ్డుకు దూరంగా ఇరువైపులా నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని గురువారం మండల విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ఏఈ ప్రవీణ్‌కు స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ఇండ్లకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని, స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటం వల్ల వైర్లు మనుషులకు అందే స్థాయిలో ఉన్నాయని, అలాగే శివాలయం ముందు ఉన్న కాలనీలో నూతనంగా నిర్మించిన ఇండ్లకు విద్యుత్ సరఫరా కల్పించాలని, డబుల్ రోడ్డుకు ఆనుకుని ఉన్న స్తంభాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ఏఈని కోరారు. ఈ విషయంపై స్పందించిన ఏఈ ప్రవీణ్ మాట్లాడుతూ కొత్తగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకునే వారికి విద్యుత్ సరఫరా దూరం ఎక్కువగా ఉంటే ప్రభుత్వం నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రోడ్డు వెంబడి కొత్త స్తంభాల ఏర్పాటుకు అయ్యే ఖర్చును భరిస్తే, సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నూతన విద్యుత్ స్తంభాలకు అయ్యే ఖర్చులను భరిస్తామని ఏఈ కి సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# రోడ్డు ప్రమాదాల నివారణకై 'అరైవ్-అలైవ్' : డి.ఎస్.పి సతీష్ కుమార్

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక మండల స్థాయి కార్యక్రమం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జమలారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అధికారులు నేడు రోడ్డు ప్రమాదాల నివారణకై 'అరైవ్--అలైవ్' కార్యక్రమం నిర్వహించి ప్రజలకు పలు అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాల్వంచ సర్కిల్ డిఎస్పి సతీష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్,సీట్‌బెల్ట్ వాడకంపై అవగాహన, సురక్షిత ప్రయాణంపై పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపడుతున్నాము అని అన్నారు. ఇంట్లో నుండి వచ్చే ప్రతి ద్విచక్ర వాహన దారుడు కచ్చితంగా హెల్మెట్ ధరించి బయటికి రావాలని, వాహన పత్రాలు ఫోర్స్ లో ఉండాలని కోరారు. అనంతరం భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకటపుల్లయ్య మాట్లాడుతూ వాహనదారులు ఇంట్లో నుండి బయటకు ఎలా క్షేమంగా వెళుతున్నారో అదే "అరైవ్" అని, అదే వాహనదారులు అదేవిధంగా క్షేమంగా ఇంటికి తిరిగి రావడం "అలైవ్" అని అన్నారు, రోడ్డు భద్రత నియమాలను క్షుణ్ణంగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఆయన వివరించారు. అనంతరం ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎంత నిధులు వస్తున్నాయి అవి ప్రజలకు ఏ విధంగా, ఏ శాఖ పరంగా ఎంత అందుతున్నాయి అని, స్వయంగా తెలిపే ప్రణాళిక ఇది అని అన్నారు. ఈ కార్యక్రమంలో "అరైవ్--అలైవ్" ఒక భాగమైనప్పటికీ ఇదే ప్రధానమైనదని రోడ్డు భద్రత నియమాలు వాహదారులు తప్పనిసరిగా పాటించాలని, పాదాచారులు కూడా తగు జాగ్రత్తలు తీసుకొని రోడ్ల ఇరువైపుల నడవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు,పలువురు నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మందా నాగరాజు, మండలం ప్రజా ప్రతినిధులు, పాల్వంచ డి.ఎస్.పి సతీష్ కుమార్, బూర్గంపహాడ్ అదనపు ఎస్ఐ నాగబిక్షం, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య, ఎంపీడీవో జమలారెడ్డి, తహసిల్దార్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ చక్రధర చారి, మిషన్ భగీరథ ఏఈ కిషోర్, అగ్రికల్చర్ ఏవో శంకర్, ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్ రెడ్డి, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, ఎలక్ట్రికల్ ఏఈ రామకృష్ణారెడ్డి, ఎంఈఓ ఎదు సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

# వనదేవతల దర్శనంతో ఆధ్యాత్మిక తృప్తి పొందిన జ్యోతిష్యుడు సీతయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, ఖమ్మం జిల్లా** పల్లెగూడెం గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి, ప్రముఖ జ్యోతిష్యుడు సీతయ్య గురువారం మేడారం సమ్మక్క–సారలమ్మ వన దేవతలను సతీసమేతంగా భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. పవిత్ర క్షేత్రానికి చేరుకున్న ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ, సమ్మక్క – సారలమ్మలపై ప్రజలకు అపారమైన భక్తి ఉందని, వారి కరుణతో ప్రజల జీవితాల్లో శ్రేయస్సు కలుగుతుందని తెలిపారు. ప్రతి ఏడాది మేడారం దర్శనం తనకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. భక్తుల రద్దీ మధ్య భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ దర్శనం కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకోవడం ద్వారా సీతయ్య తన భక్తిని చాటుకున్నారు.

# పంచాయతీ కార్యదర్శుల ఫోరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, నారాయణఖేడ్ :** మానూర్ మండల పంచాయతీ కార్యదర్శుల ఫోరం నూతన కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. నారాయణఖేడ్ టీఎన్జీఓ యూనిట్ జనరల్ సెక్రటరీ మిస్కిన్ అధ్యక్షతన, తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ జిల్లా ఫోరం జనరల్ సెక్రటరీ జె.రాజు ఆధ్వర్యంలో, జిల్లా ఫోరం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ బాలు, పబ్లిసిటీ సెక్రటరీ సుభాష్ మరియు పలువురు పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జె.రాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నర్మల సంతోష్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీగా చి. సంతోష్, కోశాధికారిగా ఎం.సంగీత, జాయింట్ సెక్రటరీగా బి.కళావతి, స్పోర్ట్స్ సెక్రటరీగా నాందేవ్‌ను ఎన్నుకోగా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా నరేష్ చారి, శ్రీను రాథోడ్, రాజ్ కుమార్, గణపతి ఎంపికయ్యారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి రఘుబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్ చేతుల మీదుగా టీపీఎస్సీఎఫ్ –2026 డైరీ మరియు టీపీఎస్డీఎఫ్ సంగారెడ్డి జిల్లా టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం మరియు గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని నాయకులు ఆకాంక్షించారు.

# భువనగిరి బస్టాండ్‌లో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 19వ వార్డులోని భువనగిరి బస్టాండ్ ఆవరణలో బుధవారం 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, డిఎస్పి రవీందర్ యాదవ్, ట్రాఫిక్ సిఐ పాల్గొన్నారు. చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ "రోడ్డు ప్రమాదాలను నివారించడం మనందరి బాధ్యత. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా వాడాలి. 18 ఏళ్లు నిండి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడపాలి. మీ భద్రత మీ కుటుంబానికి భరోసా" అని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ "అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ ప్రాణాంతకం. ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోండి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేసి, ప్రమాదాల వల్ల కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలను నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, స్థానిక కౌన్సిలర్ బండారి స్వర్ణలత, బర్రె ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్, రవాణా శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు 73 ఉద్యోగాలకు జాబ్ మేళా

### జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా ఉపాధి కల్పన ఆధ్వర్యంలో 18 ఏప్రిల్ శనివారం చుంచుపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయం రామాలయం ఎదురు బాబు క్యాంపు నందు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాలు 20 సంవత్సరాలు నుండి 34 సంవత్సరాల మధ్య యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనాలని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నుండి 30 ఉద్యోగ అవకాశాలు; భారత్ హుండాయ్ అర్కా కార్ షోరూమ్ నుండి 43 ఉద్యోగ అవకాశాలు కలవు. కావున జిల్లాలో నిరుద్యోగ యువతి యువకులు ఎనీ గ్రాడియట్ బీటెక్ డిప్లమో ఐటిఐ చేసిన నిరుద్యోగి యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శనివారం ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ జిరాక్సతో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలియజేసినారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు తప్పనిసరి జిల్లా కలెక్టర్ హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, అనుమతి లేకుండా గైర్హాజరు కాకూడదని సూచించారు.వడగాలుల నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలపై అవగాహన కల్పించి, ఓఆర్ఎస్, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. గర్భిణీల నమోదు వంద శాతం పూర్తి చేసి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని, క్షయ, మధుమేహం వంటి వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

## హుగ్గేల్లి సిద్దుల గుట్టకు ఆధ్యాత్మిక వైభవం

**ఈనెల 27, 28, 29 తేదీల్లో మహోత్సవాలు**
**గోడపత్రిక ఆవిష్కరించిన అవధూత గిరి మహారాజ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 16, ఝరాసంగం :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హుగ్గేల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సిద్దుల గుట్ట సిద్దేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను గురువారం ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. హుగ్గేల్లి గ్రామానికి ఆధ్యాత్మిక శోభను చేకూర్చేలా స్వామివారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, భక్తుల కోసం అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, హుగ్గేల్లి గ్రామ సర్పంచ్ పట్లోల విమల శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌బీ రాములు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎంజీ మానయ్య, పుట్టి అశోక్, హైదరాబాద్ కిష్టారెడ్డి, అలాగే వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక పథకాలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం

**త్వరలోనే... ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం**
**రైతులకు...ఆయిల్ ఫామ్ పంటతో అధిక ప్రయోజనం**
**పథకాల సద్వినియోగంతో ఆర్థికాభివృద్ధి సాధించాలి**
**అదనపు కలెక్టర్ హమీద్**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, సిద్దిపేట జిల్లా :** చారిత్రాత్మక పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అయితే వాటిని పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ హమీద్ స్పష్టం చేశారు. గురువారం వర్గల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రగతి ప్రణాళిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కాగా, మండల స్పెషల్ ఆఫీసర్ పవన్ కుమార్, పరిషత్ అభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, తహసిల్దార్ రఘువీర్ రెడ్డి, ఎస్సై కరుణాకర్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలని, దానికి తగినట్లుగా ప్రభుత్వం సబ్సిడీ అందజేయడంతో పాటు రూ 350 కోట్లతో నిర్మించిన ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అలాగే రిఫైనరీకి సైతం చర్యలు తీసుకుంటుండగా, మూడేళ్లలో దిగుమతి వచ్చే ఆయిల్ ఫామ్ పంటలో అంతర పంటలు సాగుచేసి ప్రయోజనం పొందవచ్చని అన్నారు. ప్రగతి ప్రణాళికలో 10 అంశాలకు ప్రాధాన్యత ఇస్తుండగా, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు కూడా పరిష్కారం కానున్నట్లు చెప్పారు. అంతేకాకుండా త్వరలోనే ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమాతో ఆర్థికంగా ఆదుకోనుండగా, విద్య, ఆరోగ్యం, వ్యవసాయశీ తదితర రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వరి పంటతో పాటు రైతులు ఇతర పంటలపై దృష్టి పెట్టాలని, తద్వారా భూసారం కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. వాతావరణ సమతుల్యతలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, చెట్ల పెంపకంపై దృష్టి పెట్టాలని, ఎరువులు క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించాలని సూచించారు. రోజురోజుకు పెరిగిపోతున్న డ్రగ్స్, మత్తు పదార్థాల సరఫరాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తద్వారా యువత, విద్యార్థులను కాపాడుకోవచ్చని చెప్పారు. జంట నగరాలకు వంటిమామిడి మార్కెట్ సమీపంలో ఉన్నందున రైతులు ఆరుతడి, కూరగాయల పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ విద్యార్థులకు అందుబాటులోకి తేనుండగా, ప్రాథమిక స్థాయిలో అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరీ చేస్తుండగా, త్వరలోనే మరికొన్ని నూతన పథకాలు ప్రారంభించనున్నట్లు వివరించారు.

# వర్షాకాలం వచ్చేలోపు సి.హెచ్.సి నూతన భవనం నిర్మాణం పూర్తి చేయాలి

**కే.వి రమణ బిఆర్ఎస్ నాయకులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బిఆర్ఎస్ నాయకులు కే.వి.రమణ, తోకల శ్రీనివాస్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు బూర్గంపహాడ్ నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సందర్శించి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కే వి రమణ గత ప్రభుత్వం హయాంలో రేగా కాంతారావు చొరవతో డి ఎం ఎఫ్ టి నిధులు రెండు కోట్ల 70 లక్షలు నూతన భవన నిర్మాణానికి మంజూరు చేయించారని 2023 సెప్టెంబర్ లో శంకుస్థాపన చేయడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం నూతన ప్రభుత్వ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సి హెచ్ సి ని ముందుకు తీసుకురావడం జరిగిందని తెలియజేస్తూ నిర్మాణ దశలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం ఎందుకు నత్తనడకన సాగుతుందో అర్థం కావటం లేదని విచారం వ్యక్తం చేశారు.రాబోవు వర్షాకాలం ప్రారంభంలోపు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బిఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. గతంలో నిర్మించబడిన పాత ఆసుపత్రి భవన నిర్మాణం చాలా పాతది అయినందున వర్షాలు వచ్చినప్పుడు సీలింగ్ కూడా కురుస్తున్నది గోడలు నాని ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితి నెలకొని ఉన్నది ఆసుపత్రిలో ఉన్న ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరికరాలు పాత భవనంలో ఉండటం కారణంగా వర్షానికి తడిచి తుప్పుపట్టే పరిస్థితి నెలకొని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఈ దుస్థితి నుంచి కాపాడాలని లక్షల విలువ చేసే అతి ఖరీదైన సామాగ్రి ప్రజాధనం నీటి పాలు కాకుండ చూడాలని ప్రభుత్వ అధికారులు స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం వీడి నూతన భవన నిర్మాణం ఎందుకు ఆలస్యం జరుగుతున్నదో తగు విచారణ చేసి త్వరితగతిన నూతన భవన నిర్మాణం పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజల తరఫున ప్రభుత్వ అధికారులను ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

# చిన్న దృష్టిలోపం కూడా పెద్ద ప్రమాదాలకు కారణమవుతుంది : జిల్లా కలెక్టర్ అంకిత్

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రహదారుల భద్రత వారోత్సవం కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డ్రైవర్లకు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పరీక్షా విభాగాలను కలెక్టర్ సందర్శించి, అక్కడ జరుగుతున్న పరీక్షల విధానం, ఉపయోగిస్తున్న పరికరాలు, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఆటో డ్రైవర్లకు ప్రాథమిక దృష్టి పరీక్షలతో పాటు దూర దృష్టి, సమీప దృష్టి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే అవసరాన్ని బట్టి కంటి ఒత్తిడి, కంటి ఆరోగ్య పరిస్థితులను కూడా పరిశీలించి, వివిధ రకాల కంటి సమస్యలను ముందుగానే గుర్తిస్తున్నారు.కంటి పరీక్షలలో చూపు మందగించడం, మసకగా కనిపించడం, దూరం లేదా సమీపంలో స్పష్టంగా కనిపించకపోవడం వంటి సమస్యలను గుర్తించి, సంబంధిత వైద్యులు తగిన సూచనలు అందిస్తున్నారు. దృష్టి లోపం ఉన్న ఆటో డ్రైవర్లకు తక్షణమే కళ్లద్దాలు అందజేసి, అవసరమైన చికిత్సకు మార్గనిర్దేశం చేస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రైవర్లకు కంటి పరీక్షలు అత్యంత ముఖ్యమని, కంటి చూపు స్పష్టంగా లేకపోతే రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ప్రతి డ్రైవర్ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించి, నిర్దిష్ట కాల వ్యవధిలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఉచిత కంటి పరీక్షా కార్యక్రమాలను డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని, తమ కంటి చూపును అశ్రద్ధ చేయకుండా సమీపంలో నిర్వహించే శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందడం ద్వారా డ్రైవర్లు సురక్షితంగా వాహనాలు నడపగలరని, తద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆటో డ్రైవర్లలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు రహదారులపై భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సేవలు అందించి, అవసరమైన వారికి వెంటనే కళ్లద్దాలు, చికిత్స అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాధ రామ్మోహన్, వైద్యులు, నర్సులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం

**చుంచుపల్లి ఎంపీడీవో సుభాషిని అధ్యక్షతన సమావేశం**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ శ్రీరామ ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం చుంచుపల్లి ఎంపీడీవో సుభాషిని అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చుంచుపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో నాగరాజు, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, టూ టౌన్ సిఐ ప్రతాప్, ఎస్ ఐ, చుంచుపల్లి మండల ఎంపిఓ కుమారి సంధ్య, ఎంఈఓ నీరజ, ఏ ఈ హౌసింగ్ నసీరుద్దీన్, ఏ ఈ ఓ మమత, ఏపిఎం ఎస్ డి అహమదుల్లా, విద్యానగర్ సర్పంచ్ శాంతి శ్రీ ,ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉపసర్పంచులు పంచాయతీ సెక్రటరీలు చుంచుపల్లి మండలం అన్ని డిపార్ట్మెంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు .99 రోజుల ప్రగతి ప్రణాళికలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు రైతు భరోసా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లులు బ్యాంకు లింకేజీలు గృహజ్యోతి మహాలక్ష్మి తదితర పదికాల అమలు లబ్ధిదారులకు ఏ విధంగా అందజేస్తున్నారు వివరించిన అధికారులు. పథకాలు అందని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే అప్లికేషన్ వివిధ కార్యాలయంలో అందజేయాలని వారు తెలియజేసినారు. ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించిన విద్యానగర్ సర్పంచ్ ఉప సర్పంచ్లను అభినందించిన అధికారులు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల అధికారులు సెక్రటరీలు సర్పంచులు ఉపసర్పంచులు వార్డు నెంబర్లు వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ ఫోన్‌ల కొనుగోలుపై అవినీతి ఆరోపణలు నిరాధారం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్‌ల కొనుగోలులో అవినీతి జరిగిందన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పోషణ్ అభియాన్ కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి 38,130 స్మార్ట్ ఫోన్‌ల కొనుగోలు ప్రక్రియను టీజీటీఎస్ ద్వారా జి ఇ ఎం పోర్టల్‌లో పారదర్శకంగా నిర్వహించారని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం గంగాపూర్ గ్రామంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సంబంధించిన వేతనాలు చెల్లించలేదని గ్రామస్థులు మండల అభివృద్ధి అధికారికి ఫిర్యాదు చేశారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కలిసి నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. ఎఫ్‌టీఓ, బ్యాంక్ వివరాలు ఉన్నాయని తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుని బకాయిలు చెల్లించాలని కోరారు.

# పోశెట్టి కుటుంబానికి కల్లుగీత కార్మిక సంఘం సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం కుర్రారం గ్రామంలో బూరుగు పోశెట్టి ఇటీవల కల్లు గీసే క్రమంలో తాటి చెట్టు పైనుండి పడి మృతి చెందగా గురువారం కుటుంబాన్ని పరామర్శించి మానసిక ధైర్యాన్ని అందించారు. రాజపేట మండలం కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం చేయగా, రాజపేట ఉప సర్పంచ్ కేదారి గౌడ్ 50 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్, గౌరవ అధ్యక్షులు గోపగాని యాదగిరి గౌడ్, కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు గోపాల్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్ గౌడ్, ఉప సర్పంచ్ కేదారి గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజు, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బసవరాజు గౌడ్, బసవయ్య గౌడ్, లక్ష్మణ్ గౌడ్, యాదగిరి గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లపల్లి సహస్ర ను సన్మానించిన మున్సిపల్ చైర్ పర్సన్ బీజన బాలమణి భాస్కర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు పట్టణానికి చెందిన తాళ్లపల్లి మహేష్ కుతురు తాళ్లపల్లి సహస్ర ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (బైపిసి గ్రూప్) లో ఉత్తమ మార్కుల సాధించి తెలంగాణ స్టేట్ 3వ ర్యాంక్ సాధించినందున ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్ విద్యార్థినిని సన్మానించి భవిష్యత్తులో ఇంకా బాగా చదువులో రాణించి ఆలేరు పట్టణానికి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, వానరాశి మరియమ్మ మార్కు, ఆంజనేయులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు బీజన భాస్కర్, ఎండి.సలీం, దూడల రాజశేఖర్, సాగర్ పాల్గొన్నారు

# బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలను ఖండించిన జలగం జగదీష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం. దేశ అత్యున్నత పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించి రాష్ట్రపతి గెజిట్ విడుదల చేసిన పవిత్ర ప్రక్రియను.. బ్రిటిష్ వారు మత ప్రాతిపదికన చేసిన దేశ విభజనతో పోల్చడం పార్లమెంటరీ వ్యవస్థను ధిక్కరించడమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అజ్ఞానానికి తెలంగాణ పట్ల ఉన్న వివక్షా పూరిత ఆలోచనా ధోరణికి అద్దం పడుతుందని బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్ ఒక ప్రకటనలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షల ఫలితమే దశాబ్దాల పోరాటం మూలంగా తెలంగాణ సాక్షాత్కరించిందనీ తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు తేజస్వీ సూర్య వ్యాఖ్యలను వెంటనే ఖండించాలన్నారు.పార్లమెంట్ సాక్షిగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించినందుకు..బీజేపీ ఎంపీ, బీజేపీ పార్టీ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు.

# త్వరలో బకాయిలు చెల్లించే అవకాశం...

## నార్మూల్ చైర్మన్ గుడిపాటి మధుసూధన్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** త్వరలో బకాయిలు చెల్లించే అవకాశం ఉన్నదని నార్మూల్ చైర్మన్ గుడిపాటి మధుసూధన్ రెడ్డి తెలిపారు. గత రెండు, మూడు నెలలుగా జరుగుతున్న అన్ని పరిణామాల గురించి మేము మీకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు. ఎన్.డి.డి.బి.తో మా యూనియన్ కుదుర్చుకోవాలనుకుంటున్న ఒప్పందం తుది దశకు చేరుకుంది. దానికి అవసరమైన అవగాహన ఒప్పందం (ఎంఓయు) పై రాష్ట్ర ప్రభుత్వం సంతకం చేయాల్సి ఉన్నందున, సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శుల నుండి ఫైల్ ఆమోదం తుది దశకు చేరుకుందని, మరో 3, 4 రోజుల్లో అన్నీ పూర్తవుతాయి, ఎన్.డి.డి.బి.తో ఒప్పందం కుదురుతుంది, మాకు రావలసిన డబ్బు లభించే అవకాశం ఉంది. సంస్థ చైర్మన్‌గా నేను మీకు హామీ ఇస్తున్నానన్నారు. మీ బకాయి ఉన్న పాల బిల్లుల మొత్తం వచ్చే బుధవారం, అనగా 22.04.2026 నాటికి తప్పకుండా జమ చేయబడుతుంది. జరిగిన ఆలస్యానికి చింతిస్తూ, ఇన్ని రోజులు ఓపికగా వేచి ఉన్న మీ అందరికీ ధన్యవాదాలు. ఈ విషయంలో మీరందరూ సహనం వహించి, మన సంఘానికి యధావిధిగా పాలు సరఫరా చేయాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. అందువల్ల, మన సంస్థ సజావుగా నడవడానికి సహాయ సహకారాలు అందించాలని రైతు సోదరులందరినీ నేను అభ్యర్థిస్తున్నానన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా తుర్కపల్లి మండల స్థాయి సమావేశం

## పాల్గొన్న ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం తుర్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని ఈ పథకాలు అందని అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే వారినుండి దరఖాస్తులు తీసుకోవాలని అధికారులకు తెలిపారు గ్రామాలలో పెండింగులో ఉన్న అభివృద్ధి పనులను 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా పూర్తి చేసి ప్రారంభించాలని తెలియజేశారు ఈ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి మరియు సంక్షేమం దిశగా ముందుకు పోతుందని కొనియాడారు అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర మంత్రుల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య గత పాలకులు నిర్లక్ష్యం చేసిన మన నియోజకవర్గం ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుండని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, ఏంఆర్ఓ, ఎస్ఐ, ఎంపీవో మరియు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు ,కార్యదర్శులు పాల్గొన్నారు.

# యాదాద్రిలో భక్తుల రద్దీ... నిత్య రాబడి రూ.12.82 లక్షలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రమైన యాదాద్రిలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి నిత్య పూజలు, ఆరాధనలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన సువర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం, వేదఆశీర్వచనం, సాయంత్రం వెండి మొక్కు జోడి సేవల్లో పాల్గొన్నారు. కొండకింద సత్యనారాయణ స్వామి వ్రతాల్లోనూ భక్తులు పాల్గొన్నారు. అనుబంధ ఆలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి, పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను కూడా దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్య రాబడిగా గురువారం రూ.12,82,284 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ప్రశాంత్ చార్యులు, రామాచార్యులు, ఇన్‌చార్జి వెంకటేష్, ఎస్పీఎఫ్ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌లో ఘోరం..ఆలయ దర్శనానికి వెళ్లిన విద్యార్థినిపై అడవిలో గ్యాంగ్ రేప్!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, సెంట్రల్ డెస్క్ :** మధ్యప్రదేశ్‌లోని డాక్టర్ అంబేద్కర్ నగర్ (మహో) పరిధిలో గల బెర్చా అటవీ ప్రాంతంలో ఒక కళాశాల విద్యార్థినిపై ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సదరు యువతి తన స్నేహితుడితో కలిసి లగ్నాషా భైరవ్ బాబా ఆలయాన్ని దర్శించుకుని, సమీపంలోని జై జవాన్ జై కిసాన్ చెరువు వద్ద ఏకాంతంగా ఉన్న సమయంలో పొంచి ఉన్న నిందితులు వారిపై దాడి చేశారు. యువతి స్నేహితుడిని కర్రలతో కొట్టి అక్కడి నుండి తరిమివేసిన దుండగులు, బాధితురాలిని అడవిలోకి బలవంతంగా లాక్కెళ్లి ఈ అమానుషానికి ఒడిగట్టారు.ఘటన అనంతరం నిందితులు పరారు కాగా, గాయపడిన స్నేహితుడు పోలీసులకు సమాచారం అందించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని, ఆమె స్నేహితుడిని విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించి, ఆధారాలు సేకరించారు. ప్రస్తుతం గుర్తుతెలియని వ్యక్తులపై సామూహిక అత్యాచారం, కిడ్నాప్ కేసులు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# బీర్ల ఐలయ్య సవాల్ ను స్వాగతిస్తున్నాం : కల్లూరి రామచంద్రారెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు గ్రామంలోని 322 సర్వే నెంబర్ క్రషర్ వ్యవహారంలో చర్చకు సిద్ధమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేసిన సవాల్ ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి స్వాగతించారు. వివాదాస్పదంగా మారిన సదరు క్రషర్ వద్దే ఈ బహిరంగ చర్చ నిర్వహిద్దామని, ఎమ్మెల్యే బిజీ షెడ్యూల్ దృష్ట్యా మీరు తేదీని ఖరారు చేస్తే తాము రావడానికి సిద్ధమని ప్రకటించారు. జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నేతలు, జర్నలిస్టుల సాక్షిగా ఈ చర్చ జరగాలని డిమాండ్ చేశారు. చల్లూరులో రాత్రింబగళ్లు అక్రమంగా బ్లాస్టింగ్‌లు జరుగుతున్నా ఎందుకు మౌనంగా ఉన్నారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తే సోషల్ మీడియా పేరుతో కేసులు పెడతామని బెదిరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, తక్షణమే సదరు క్రషర్ కార్యకలాపాలను నిలిపివేయించి విచారణ జరిపించడం ద్వారా ఎమ్మెల్యే తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు

## దడదడలాడించిన పంజాబ్ కింగ్స్... ముంబై ఖాతాలో మరో ఓటమి




ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను 7 వికెట్ల తేడాతో పంజాబ్ చిత్తుగా ఓడించింది. ముంబై నిర్దేశించిన 196 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 16.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (39 బంతుల్లో 80లి), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (35 బంతుల్లో 66) విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో పంజాబ్‌కు మరపురాని విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో పంజాబ్ పాయింట్ల పట్టికలో తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.196 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్ కింగ్స్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. అయితే, 45 పరుగులకే ప్రియాన్ష్ ఆర్య (15), కూపర్ కానలీ (17) వికెట్లను కోల్పోయింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో కలిసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కేవలం 66 బంతుల్లోనే 139 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ముంబై బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీల వర్షం కురిపించారు. ప్రభ్‌సిమ్రన్ ఆఖరి వరకు నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించాడు. ముంబై బౌలర్లు పూర్తిగా తేలిపోయి భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అంతకుముందు, ఈ పోరులో పంజాబ్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దాంతో బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇన్నింగ్స్ ఆరంభంలోనే తడబడింది. 12 పరుగులకే రియాన్ రికెల్టన్ (2), సూర్యకుమార్ యాదవ్ (0) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ క్వింటన్ డికాక్ అద్వితీయ పోరాటం చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరో ఎండ్‌లో పాతుకుపోయి పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అతనికి నమన్ ధిర్ (31 బంతుల్లో 50) చక్కటి సహకారం అందించడంతో ముంబై కోలుకుంది. డికాక్ కేవలం 60 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో అజేయంగా 112 పరుగులు సాధించాడు. దీంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు చేసింది. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ కేవలం 22 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి ముంబైని కట్టడి చేశాడు.పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌లలో 4 విజయాలు నమోదు చేసింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ప్రస్తుతం పంజాబ్ 9 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతోంది.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అదనపు కలెక్టర్ భాస్కర్ రావు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి పకడ్బందీగా చేరేలా చర్యలు తీసుకోవాలని, మండల స్థాయిలో సమస్యల పరిష్కారానికి మండల సభలు సమర్థ వేదికగా నిలుస్తాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ఆలేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సభను నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి వెంకట రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. రెవెన్యూ, విద్య, వ్యవసాయ, విద్యుత్, పంచాయతీరాజ్, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు ఇందిరమ్మ ఇల్లు, ఇందిరా కాంతి, చేయూత పింఛన్ల అమలుపై అధికారులు నివేదికలు సమర్పించారు. సర్పంచులు, అధికారులకు అదనపు కలెక్టర్ తగు సూచనలు చేశారు. వ్యవసాయంపై చర్చలో భాగంగా యూరియా యాప్‌ను వినియోగించి ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా చూడాలని సూచించారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న సేవలను ప్రజలకు చేరవేయాలని, విద్యుత్ విభాగంలో సూర్యగర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. విద్యా రంగంలో గ్రామాల్లో ప్రతి బాలబాలిక పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, తహసీల్దార్ ఆంజనేయులు, జిల్లా వైద్యాధికారి డా.మనోహర్, సీఐ డీ.యాలాద్రి, మండల పంచాయతీ అధికారి అనురాధ దేవి, పర్యవేక్షకులు హరిత దేవి, గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### చేనేత కార్మికుల ఆరోగ్య వైద్య శిబిరాలకు

## మంచి స్పందన : అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యదాద్రి భువంగిరి జిల్లాలోని చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. గురువారం ఆలేరు గౌడ సంఘ భవనంలో చేనేత కార్మికుల కోసం "ఆరోగ్య భరోసా" కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతి మగ్గాలపై పట్టు దారాలతో వస్త్రాలను నేసే చేనేత వృత్తి సాంస్కృతిక వారసత్వంగా కొనసాగుతుండగా, ఈ వృత్తిలో ఉన్న కార్మికులకు ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతో జిల్లా ఆరోగ్య శాఖ, హ్యాండ్లూమ్ ఢ టెక్స్టైల్స్ శాఖల సమన్వయంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు, ల్యాబ్ పరీక్షలు అందించారు. హెల్త్ కార్డులు పంపిణీ చేసి, ప్రతి కార్మికుడి వైద్య వివరాలను నమోదు చేశారు. అవసరమైన మందులు కూడా అందజేశారు. చేనేత కార్మికులు వృత్తి కారణంగా అనేక శారీరక సమస్యలు ఎదుర్కొంటారని, ఇలాంటి మెడికల్ క్యాంపులు వారికి ఉపయుక్తంగా ఉంటాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి డా. మనోహర్ మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, డిఆర్‌డిఎ, పిడి నాగిరెడ్డి, హ్యాండ్లూమ్ ఢ టెక్స్టైల్స్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు, చేనేత సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

## మండల స్థాయి సమావేశం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక మండల స్థాయి కార్యక్రమం గురువారం మండల ప్రత్యేక అధికారిని శాంత నిర్మల అధ్యక్షతన మండల సభ కార్యక్రమం జరిగింది. తెలంగాణ గేయం ముఖ్యమంత్రి సందేశం. ఎంపీడీవో నాగవేణి ప్రారంభ స్వాగత ఉపన్యాసం, శాఖల వారి ప్రగతి నివేదికలు "అరైవ్ అలైవ్" – పోలీస్ శాఖ ద్వారా ఎస్ఐ లింగారెడ్డి, ఆరోగ్యశాఖ ప్రగతి నివేదిక డాక్టర్ ఆమోస్, రెవెన్యూ మరియు సివిల్ సప్లై ప్రగతి నివేదిక (నూతన రేషన్ కార్డులు ,కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ సబ్సిడీ రూ. 500) తహసిల్దార్ వల్లపు ప్రదీప్, వ్యవసాయ శాఖ ప్రగతి నివేదికలు (రైతు భరోసా, రైతు బీమా, సన్న రకం వడ్లు బోనస్) పంటల మార్పు సేంద్రియ వ్యవసాయం ఏఈఓ లు వివరించగా, విద్యుత్ శాఖ గృహజ్యోతి ప్రగతి నివేదిక ఏఈ చంద్రశేఖర్, గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం ప్రగతి నివేదికలు (ఇందిరమ్మ చీరలు, వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు) ఏపిఎం మురారి, ఇందిరమ్మ ఇండ్ల వివరాలు ఏఈ వివేక్, గ్రామీణ అభివృద్ధి శాఖ చేయూత పెన్షన్లు ప్రగతి నివేదిక. పంచాయతీరాజ్ శాఖ 99 రోజుల కార్యచరణ ప్రణాళిక పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మండల స్థాయిలో ప్రధానమైన సమస్యలు గుర్తించడం వాటి పరిష్కారాలు తీర్మానించడం ముఖ్య అతిధుల సందేశాలు. వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిసాయి.

## ప్రభుత్వ విప్ బీర్ల కు సవాల్ విసిరే స్తాయి కల్లూరి కి లేదు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కనీసం వార్డు మెంబర్ గా గెలవలేని కల్లూరి రామచంద్రారెడ్డి ఆలేరు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజల మనిషిగా మన్ననలు అందుకుంటున్న ప్రభుత్వ విప్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ను విమర్శించే స్థాయి కాదని రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు నాయకులు ఘాటుగా విమర్శించారు. గురువారం రాజపేట గెస్ట్ హౌస్ లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజపేట మండలం చల్లూరు గ్రామం 324 సర్వే నెంబర్లో గత 20 సంవత్సరాల నుంచి డెవలప్మెంట్, లేఅవుట్ పనులు జరుగుతున్నాయని, 2019 సంవత్సరంలో టిఆర్ఎస్ హయాంలో నారాయణ రావు అనే వ్యక్తి శ్రీని క్రషర్ పేరుతో 324 సర్వే నెంబర్లో లేఅవుట్, వెంచర్ డెవలప్మెంట్ పనులకు 2021 నుండి 2024 వరకు మైనింగ్, క్రషర్ కంపెనీని నడిపాడని, ఆ క్రషర్ కి మైనింగ్ పర్మిషన్లు ఇచ్చింది ఎవరు, కరెంట్ కనెక్షన్ ఎవరు హాయంలో ఇచ్చారని ప్రశ్నించారు. 2023 డిసెంబర్లో ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రజల మధ్య ఉంటూ అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతుంటే ఓర్వలేక, ఒక బలహీన వర్గాల నాయకుని ఎదుగుదలను చూసి తట్టుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కల్లూరు కాదు కుల్లూరు రామచంద్ర రెడ్డి అంటూ ఇదే మా సవాల్ అని సమయము తేదీని ప్రకటించాలని, అధికారుల్ని ఆలేరు నియోజకవర్గ అఖిలపక్ష నాయకులను ఆహ్వానిద్దామని, బహిరంగ చర్చ చేద్దామన్నారు. గతంలో సక్రమమైనవి ఇప్పుడు అక్రమం ఎలా అయిందని బహిరంగ చర్చ ద్వారా తెలుద్దామన్నారు. అదే బహిరంగ చర్చలో ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణ నిరూపించకపోతే అదే ప్రజలతో కల్లూరు రామచంద్రారెడ్డికి చెప్పుల దండలు వేయించి, అర గుండు కొట్టించి ఊరేగిస్తామన్నారు. ఆలేరు ప్రజలకు 24 గంటలు సేవ చేస్తున్న ఎమ్మెల్యే పై మరొకసారి అసత్య ఆరోపణలు చేస్తే కల్లూరు రామచంద్రారెడ్డికి మహిళలతో చీపురు దెబ్బలు ఖాయమన్నారు. కల్లూరి రామచంద్రారెడ్డి ని మొఖం చుస్తేనే తెలుస్తోందని, రాజకీయ, పదవి యోగ్యం లేదని అపహాస్యం చేశారు. ఎన్ని పార్టీలు మారినప్పటికీ పదవి యోగం లేదన్నారు. గతంలో బొమ్మలరామారం మండలంలో కాంగ్రెస్ పార్టీ నుండి జడ్పిటిసిగా గెలువలేని వ్యక్తివి, ఒక ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై ఆరోపణలు చేస్తావా అని ఆగ్రహించారు. రాజపేట మండలం చల్లురు క్రషర్ ఎవరిది, అనుమతులు ఉన్నాయా లెవా ఆ కంపెనీ యజమానులను అడిగితే తెలుస్తుంది, కానీ ప్రతిసారి బీర్ల ఐలయ్యపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఎవరు ఊరుకోరన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే గొంగిడి సునీత ఆలేరు ఎమ్మెల్యేగా ప్రభుత్వ విప్ గా ఉన్నపుడే క్రషర్ ప్రారంబించారని వివరించారు. ప్రభుత్వ ప్రజల సొమ్ము దండుకొని ఇప్పుడు బీర్ల ఐలయ్య పై ఆరోపణలు చేయడం సరికాదు. ఎమ్మెల్యే సవాల్ ని స్వాగతించే స్థాయి నీకు లేదని కల్లూరి ని ఉద్దేశించి మాట్లాడుతూ తాము వస్తామని ఆ కంపెనీ ఎవరిది యజమానులెవరు తెలుస్తామన్నారు. ఇటీవల ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మీడియా సమావేశం ద్వారా స్పష్టం చేసినప్పటికీ ఆరోపణలు చేయడం అవివేకం అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి వాగులు, చెరువులు నిండి జలకళ సంతరించుకుంటే అది చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నావా అని ప్రశ్నించారు. బిసి బిడ్డగా ఐలయ్య ఎదుగుతుంటే ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అనేక రకాల సేవ కార్యక్రమాలు చేసి పేద ప్రజల మనసు గెలుచుకొని ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రంలో ప్రభుత్వ విప్ గా బాధ్యతలు చేపడుతున్న సందర్భంలో ఓర్వలేక ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మరోసారి బీర్ల ఐలయ్య పై ఆరోపణలు చేస్తే గ్రామాలలో తిరగనీయం ఖబర్దార్ కల్లూరు రామచంద్రారెడ్డి అంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర నియోజకవర్గ మండల గ్రామ శాఖ నాయకులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# యమపాశంల దూసుకొచ్చిన బొలెరో... 18 మూగజీవాలు మృతి

**డ్రైవర్ నిర్లక్ష్యానికి మేకల కాపరి కన్నీటి శోకసంద్రం**

**సుమారు నాలుగు లక్షల వరకు నష్టం**


**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 16, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా :**
రెబ్బెన మండలం కాగజ్నగర్ ఎక్స్ రోడ్ వద్ద బొలెరో నడుపుతున్న డ్రైవర్ నిర్లక్ష్యంతో 18 మేకలు మృత్యువాత పడ్డాయి. రోడ్డుపై వెళ్తున్నది మనుషులైనా, మూగజీవాలైనా ప్రాణం ఒకటే అన్న కనీస స్పృహ లేకుండా మితిమీరిన వేగంతో వాహనాన్ని నడిపి ఒక డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. అతని అజాగ్రత్త 18 మేకల ప్రాణాలను గాలిలో కలిపేసింది. కొమరం భీమ్ జిల్లా రెబ్బెన మండలంలోని కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సుమారు సాయంత్రం 6 గంటల సమయం లో రెబ్బెన నుండి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ఒక బొలెరో వాహనం డ్రైవర్, రోడ్డు దాటుతున్న మేకల మందను చూసినప్పటికీ వేగం తగ్గించకుండా అమాంతం వాటిపైకి దూసుకెళ్లాడు. ఆ వాహన చక్రాల కింద నలిగి 18 మేకలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. ప్రమాదం తీవ్రత ఎంతలా ఉందంటే, రోడ్డంతా రక్తసిక్తమై మూగజీవాల కళేబరాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఘోరం జరిగిన తర్వాత కనీసం ఆగి పశ్చాత్తాపం చూపించాల్సిన డ్రైవర్, భయంకరమైన వేగంతో అక్కడి నుండి పరారయ్యాడు. కళ్లముందే తన సంపదంతా మట్టిపాలవడంతో మేకల కాపరి రోదనలు మిన్నంటాయి. నా నోరులేని జీవాలను చంపేశావే అంటూ



ఆవేదన వ్యక్తం చేస్తూ, చనిపోయిన మేకలతో రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. జాతీయ రహదారి కావడంతో వందలాది వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు దాదాపు గంట సేపు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలిసిన వెంటనే రెబ్బెన ఎస్సై వెంకట కృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కాపరికి న్యాయం జరిగే విధంగా చూస్తామని బులోరా వాహనదారుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తాం అని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. అసలు వాహనం నడిపే వ్యక్తికి కళ్లు లేవా మంద కనిపిస్తున్నా ఆపకుండా వెళ్లడమంటే అది నిర్లక్ష్యం కాక మరేమిటి పేదవాడి నోటికాడి కూడు తీసేసి, హంతకుడిలా పారిపోతారా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సల్కం చెరువులో ఓవైసీ విద్యాసంస్థలు..
# సొంత రిస్క్‌పైనే అడ్మిషన్లు తీసుకోండి.. హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 16, పాతబస్తీ :**
హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలంగాణ హైకోర్టు కీలక సూచన చేసింది. ఈ విద్యా సంస్థ నిర్మాణాల విషయమై పిటిషన్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు, వారి పేరెంట్స్ తమ సొంత రిస్క్‌పైనే అడ్మిషన్లు తీసుకోవాలని స్పష్టం చేసింది. విద్యాసంస్థకు వ్యతిరేకంగా తీర్పు వస్తే అప్పుడు ఎలాంటి హక్కులు కోరలేరని స్పష్టం చేసింది. కాబట్టి ఇప్పటికే అక్కడ చదువుతున్న విద్యార్థుల భవితవ్యం కూడా తుది తీర్పుకు లోబడే ఉంటుందని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ విద్యా సంస్థను అక్రమంగా నిర్మించారని దీనిపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని అడ్వకేట్ విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నగరంలో 26 చెరువులుండగా.. కేవలం సల్కం చెరువుకు మాత్రమే ఎఫ్‌టీఎల్ ఖరారు చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ స్థాపించిన 'సలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఈ సంస్థ నడుస్తోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తే.. ఈ సంస్థ చెరువు మధ్యలో, బఫర్ జోన్‌లో నిర్మించినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. విద్యా సంస్థపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని మేనేజ్‌మెంట్ తమ నోటీసు బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. దాంతో పాటు సల్కం చెరువు పరిధిలో ఇకపై ఎలాంటి అదనపు




నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 1 నుండి ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరంపై కోర్టు ఇచ్చే తదుపరి ఉత్తర్వులు ప్రభావం చూపుతాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. కాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. ఒవైసీ ఫాతిమా కాలేజీ సల్కం చెరువులో నిర్మించినట్లు ఆధారాలు ఉన్నా.. దానిపై చర్యలు తీసుకోలేదు. ఇదే విషయమై సోషల్ మీడియా తదితర మాధ్యమల్లో హైడ్రాని పలువురు ప్రశ్నించారు. దీంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గతంలోనే క్లారిటీ ఇచ్చారు. సల్కం చెరువు ఎఫ్టీఎల్‌లో నిర్మించిన ఫాతిమా కాలేజ్ తొలగిస్తామని గత సెప్టెంబర్‌లో ప్రకటించామని చెప్పారు. అయితే పేద ముస్లిం మహిళల కోసం కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థ ఇక్కడ నడుస్తోందని అన్నారు. ఈ కాలేజీలో ఎలాంటి ఫీజులు వసూలు చేయరని.. 10 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పేదల కోసం పనిచేస్తున్న కాలేజీ అయినందునే సామాజిక కోణంలో ఆలోచించి చర్యలు తీసుకోలేకపోతున్నామని చెప్పారు.

# వీధి వ్యాపారులను వీధిన పడేయకండి : సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 16, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
రేవంత్ రెడ్డి ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన పేరిట ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆక్రమణలు తొలగిస్తున్నామనే పేరుతో వీధి వ్యాపారులపై తమ ప్రతాపం చూపడం అన్యాయమని వెంటనే అటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని అన్నారు. గాంధీనగర్ పారిశ్రామిక వాడలో గత 30 సంవత్సరాలుగా రోడ్డు కు 10 ఫీట్ల దూరంలో చిన్న డబ్బాలో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నటువంటి పేదవాళ్లను తొలగిస్తూ వాళ్ళ జీవితాలను వాళ్ళ కుటుంబాలను రోడ్డుపాలు చేయడమేనని అలాంటి నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తుంది కావున ట్రాఫిక్కు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించని వీధి వ్యాపారులను ఇబ్బంది చేయొద్దని సిపిఐ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ లోని ఇండస్ట్రియల్ కార్యాలయంలో మేనేజర్ శ్రీవాణి కలిసి వినతి పత్రం అందచేశారు ఈ ప్రాంతంలో వీధి వ్యాపారం చేసుకుని తమ కుటుంబానికి అండగా నిలిచే వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులను ఇచ్చి అలాగే లోన్లు కూడా ఇచ్చిందని ఈ విధంగా వీధి వ్యాపారులు ప్రభుత్వం చే గుర్తింపబడ్డవాళ్ళు కాబట్టి వారిని తొలగించడం అన్యాయమని వీధి వ్యాపారులకు వర్తించే చట్టాలు అమలు చేసి వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులు దేనని అన్నారు. డబ్బులు చెల్లించి కిరాయిలు తీసుకునే పరిస్థితి లేనందు వల్లే వారు రోడ్డుపై వ్యాపారం చేస్తున్నారని ప్రభుత్వం పైన ఆధారపడకుండా సొంతంగా జీవనోపాధిని కల్పించుకుంటున్నారని అలాంటి వారి పైన మానవతా దృక్పథంతో పనిచేయాలని వారికి అన్యాయం చేయొద్దని, వాళ్ల తరపున పోరాడటానికి సిపిఐ మరియు ఏఐటీయూసీ నాయకత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలియజేశారు. గత నాలుగు సంవత్సరాల క్రితం ఇదే విధంగా ఇబ్బంది చేస్తే అప్పటి మేనేజర్ మాధవి మేడం క్షేత్ర పర్యటన చేసి వారు రోడ్డుకు దూరంగానే ఉన్నారని ప్రజలకు గాని ట్రాఫిక్కు గానీ ఎలాంటి ఇబ్బంది లేదని నిర్ధారించుకొని వారికి ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారని



అన్నారు కావున గతంలో ఇచ్చిన హామీ ప్రకారం వీధి వ్యాపారులకు ఎలాంటి నష్టం చేకూర్చొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఏఐటీయూసీ అనుబంధ వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షులు జావిద్, కార్యదర్శి యాదగిరి, సంఘం నాయకులు చాంద్, ఖాన్, జుబేర్,ఆదిల్, మహేష్, రవీందర్ సింగ్, శ్రీ పత్, ముస్తఫా లతోపాటు వీధి వ్యాపారులు పాలుకొన్నారు.

# సమ్మర్‌లో రోజూ షూ వేసుకుంటున్నారా? ఈ తప్పులు చేయకండి

ఇంటర్నెట్ డెస్క్: వేసవి కాలంలో దుస్తులే కాకుండా పాదరక్షలను కూడా మార్చుకోవడం అవసరం. వేడి ఎక్కువగా ఉండే ఈ కాలంలో సౌకర్యంగా ఉండే చెప్పులు, షూలు ఎంచుకోవడం చాలా ముఖ్యం. కానీ చాలా మంది చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల పాదాల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. సరైన పాదరక్షలు ధరించకపోతే చెమట ఎక్కువగా పట్టడం, దుర్వాసన, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, అలర్జీల వంటి సమస్యలు రావచ్చు.

**రోజంతా షూ ధరించడం**

వేసవిలో రోజంతా షూ ధరించడం వల్ల చెమట ఎక్కువగా పట్టి దుర్వాసన, ఫంగల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. అందుకే తేలికపాటి, మెష్ లేదా తోలు పదార్థంతో బూట్లను ఎంచుకోవడం మంచిది. ఎందుకంటే రోజంతా మూసి ఉన్న షూలు ధరిస్తే పాదాలకు గాలి తగలదు, చెమట పేరుకుపోతుంది. దీంతో బ్యాక్టీరియా పెరిగి ఇన్ఫెక్షన్లు రావడానికి అవకాశం ఉంటుంది.

**సింథటిక్ పదార్థాల చెప్పులు వాడటం..**

ప్లాస్టిక్ లేదా సింథటిక్ పదార్థాలతో చేసిన చెప్పులు గాలి సరిగా వెళ్లనివ్వవు. దీంతో చెమట లోపలే నిలిచి దుర్వాసన,



ఫంగల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. అలాగే, తడిగా ఉన్న లేదా చెమట పట్టిన చెప్పులను మళ్లీ ధరించడం మంచిది కాదు. ఇలా చేస్తే బ్యాక్టీరియా త్వరగా పెరిగి చర్మ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. అదే విధంగా, చాలా బిగుతుగా లేదా చాలా వదులుగా ఉన్న చెప్పులు ధరించడం వల్ల పాదాలకు గాయాలు, బొబ్బలు రావచ్చు. ఇవి తర్వాత ఇన్ఫెక్షన్లకు దారితీయవచ్చు. అలాగే, వేసవిలో పాదాలను శుభ్రంగా ఉంచడం చాలా అవసరం. రోజూ పాదాలను కడుక్కోకపోతే బ్యాక్టీరియా, ఫంగస్ పెరిగి సమస్యలు వస్తాయి. అలాగే చెప్పులను కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి.

# పరగడుపున పండ్లు తినవచ్చా? ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారంటే..!




పరగడుపున పండ్లు తినొచ్చా? తినకూడదా? తింటే ఏమవుతుంది? చాలామందిలో మెదిలే ప్రశ్న ఇది. ఈ అంశంపై ఒక్కొక్కరు ఒక్కో అభిప్రాయం వ్యక్తం చేస్తుంటారు. కొందరు ఖాళీ కడుపుతో పండ్లను తీసుకోవద్దని చెబితే.. మరికొందరు ఖాళీ కడుపుతోనే పండ్లను తినాలని చెబుతుంటారు. మరి నిజంగా పరగడుపున పండ్లు తినొచ్చా? తింటే ఎలాంటి పండ్లను తినాలి? ఎలాంటి పండ్లను తినకూడదు? పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం..ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఉదయం పూట ఖాళీ కడుపుతో పండ్లు తినవచ్చు. అయితే, ఎలాంటి పండ్లు తింటున్నారనేదే ఇక్కడ కీలకం. ఉదయాన్నే పరగడుపున ఆపిల్, బొప్పాయి, పుచ్చకాయ వంటి పండ్లను తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. అరటిపండు తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**ఖాళీ కడుపుతో పండ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు..**

ఉదయాన్నే పండ్లు తినడం వలన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పండ్లు తేలికగా, సులభంగా జీర్ణమవుతాయి. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. పండ్లలో ఉండే పీచుపదార్థం, విటమిన్లు, ఖనిజాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. కడుపు నిండిన భావన కలిగి, పదేపదే తినే అలవాటు తగ్గుతుంది.

**ఇది అందరికీ వర్తిస్తుందా?**

ఖాళీ కడుపుతో పండ్లు తినడం అందరికీ సరికాదు. అజీర్తి, యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలు ఉన్నవారు ఉదయాన్నే పండ్లు తినడం వలన దుష్ప్రభావాలు కలుగుతాయి. ప్రధానంగా నారింజ, అరటిపండ్లు లాంటివి ఉదర సమస్యలకు దారితీస్తాయి. బొప్పాయిని కూడా మితంగా తీసుకోవడం మంచిది.

**పండ్లు ఎలా తినాలి..?**

ఎప్పుడైనా సరే తాజా పండ్లనే తినాలి. పండ్ల రసాన్ని తాగడం కంటే వాటిని నేరుగా తినడం వలన ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. అయితే, అన్ని రకాల పండ్లను కలిపి ఒకేసారి అధిక పరిమాణంలో తినకూడదు. పండ్లు తిన్న వెంటనే ఆహారం తినడం కూడా మంచిదికాదు.

# కేంద్రం కీలక నిర్ణయం..

## రెండేళ్ల లోపు వారికి దగ్గు మందు వాడకంపై నిషేధం..



న్యూఢిల్లీ: దేశంలోని చిన్న పిల్లల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక సంచలన నిర్ణయానికి సిద్ధమైంది. 'డ్రాఫ్ట్ నేషనల్ ఫార్ములరీ ఆఫ్ ఇండియా (చీఖీX) 2026' ప్రతిపాదనల్లో భాగంగా.. రెండేళ్ల లోపు వయసున్న చిన్నారులకు దగ్గు, జలుబు సిరప్‌లను వాడకూడదని కఠిన నిబంధనలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. 2025లో మధ్య ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో కలుషిత దగ్గు మందుల కారణంగా ఎంతోమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్రం ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.రెండేళ్ల లోపు చిన్నారులకు దగ్గు మందు సిఫార్స్ చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ మందులు ఇవ్వాల్సి వస్తే.. అర్హులైన డాక్టర్ల పర్యవేక్షణలో ఇవ్వాలని చెబుతున్నారు. దగ్గు మందుల్లో ఉండే కొన్ని రసాయనాలు.. ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెండేళ్ల లోపు పిల్లల దగ్గుకు ఆవిరి పట్టడం, గోరు వెచ్చని నీరు, లిక్విడ్ ఆహారం ఇవాలని చెబుతున్నారు. ఈ డ్రాఫ్ట్ నిబంధనలు త్వరలో దేశ వ్యాప్తంగా అధికారికంగా అమలు కానున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు దీనిపై అడ్వైజరీలు జారీ చేశాయి.





## మంచిర్యాల సెగను తట్టుకుని తిరుమల చెంతకు


### సంయుక్త మీనన్ ఎమోషనల్ పోస్ట్

టాలీవుడ్ 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్ తన తాజా చిత్రం 'బ్లాక్ గోల్డ్' షూటింగ్‌లో ఎదురైన సవాళ్లను వివరిస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. సినిమా తెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, దాని వెనుక చిత్ర యూనిట్ పడే శ్రమ ఎంతటిదో ఆమె పెట్టిన పోస్ట్ నిరూపిస్తోంది.సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమా కోసం చిత్ర యూనిట్ మంచిర్యాలలో షూటింగ్ నిర్వహించింది. అక్కడ 40 నుంచి 45 డిగ్రీల తీవ్రమైన ఉష్ణోగ్రతల మధ్య పనిచేయడం తమను శారీరకంగా, మానసికంగా పరీక్షించిందని సంయుక్త పేర్కొంది. మండుతున్న ఎండలు, తీవ్రమైన అలసట వేధించినప్పటికీ చిత్ర బృందం ఎక్కడా వెనకడుగు వేయకుండా పనిచేసిందని ఆమె కితాబునిచ్చింది. డీహైడ్రేషన్ బారిన పడకుండా తన పర్సనల్ టీమ్ (నిహారిక, పార్థు) తీసుకున్న జాగ్రత్తలు, దర్శకుడు యోగి అందించిన ప్రోత్సాహం వల్లే ఈ కఠినమైన షెడ్యూల్‌ను పూర్తి చేయగలిగానని తెలిపింది.మంచిర్యాల షెడ్యూల్ ముగిసిన వెంటనే సంయుక్త నేరుగా తిరుమలకు చేరుకుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్న ఆమె, ఆ ప్రశాంతతలో దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఎంతటి ఒత్తిడిలో షూటింగ్ ప్రారంభించానో, అంతే ఉత్సాహంతో తిరిగి వస్తున్నానని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

## తన ఫొటోలతో ప్రచారం చేసుకున్నారంటూ తమన్నా పిటిషన్.. కొట్టివేసిన హైకోర్టు

'పవర్ సోప్స్' కంపెనీపై ప్రముఖ సినీ నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి ఆమె తగిన సాక్ష్యాలు చూపలేకపోవడంతో న్యాయస్థానం పిటిషన్‌ను తోసిపుచ్చింది. బ్రాండ్ ప్రమోషన్స్‌కు సంబంధించి తమన్నా, పవర్ సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 2009 అక్టోబర్ వరకు తమన్నా ఫొటోలతో పవర్ సోప్స్ ప్రచారం చేసుకోవడానికి అనుమతి ఉందిఅయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010-2011 మధ్య ఈ సంస్థ తన ఫొటోలను అనుమతి లేకపోయినప్పటికీ ఉపయోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకు గాను తనకు రూ.1 కోటి పరిహారం నష్టపరిహారం ఇప్పించాలని కోర్టును ఆశ్రయించారు. అయితే ఇందుకు సంబంధించి సాక్ష్యాలు చూపలేదంటూ కోర్టు తమన్నా పిటిషన్‌ను కొట్టివేసింది

## ఇంటర్ లో 459/470 సాధించిన కార్తీకదీపం సీరియల్ చిన్నారి కృతిక



'కార్తీకదీపం' సీరియల్‌తో తెలుగు రాష్ట్రాల్లో ఇంటింటికీ పరిచయమైన 'శౌర్య' అలియాస్ బేబీ కృతిక (సహృద) చదువులోనూ తన సత్తా చాటింది. ఇటీవల విడుదలైన తెలంగాణ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఆమె అద్భుతమైన మార్కులు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. నటనలో రాణిస్తూనే, చదువులోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంపై ఆమెకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.వివరాల్లోకి వెళ్తే, తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షల్లో కృతిక ఎంపీసీ గ్రూప్‌లో 470 మార్కులకు గానూ 459 మార్కులు సాధించింది. తన మార్కుల మెమోను ఆమె సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో ఈ విషయం వైరల్ అయింది.'కార్తీకదీపం' సీరియల్‌లో 'వంటలక్క', 'డాక్టర్ బాబు'ల కూతురిగా, 'రౌడీ'గా తన నటనతో కృతిక ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ చదువును నిర్లక్ష్యం చేయకపోవడంపై నెటిజన్లు, అభిమానులు ఆమెను అభినందిస్తున్నారు. కృతిక గతంలో 'సరిలేరు నీకెవ్వరు', 'రాగల 24 గంటల్లో' వంటి చిత్రాల్లోనూ బాలనటిగా నటించింది. ప్రస్తుతం ఆమె ఇంటర్ రెండో సంవత్సరంలోకి అడుగుపెట్టనుంది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.